సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 14 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

ఆలయ ఉద్యోగులకు పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు

వేములవాడ: రాజన్న ఆలయంలో రికార్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న నరాల రాజు, పొల్సాని రాజు, రాకేశ్, గుడిపల్లి రమణ, మేకల వెంకటేశ్, కనకదుర్గలకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఈవో చాంబర్‌లో వారికి పదోన్నతి పత్రాలు అందజేశారు. రోస్టర్ పద్ధతిలో ఈ ప్రమోషన్లు ఇచ్చినట్లు తెలిసింది. ఆలయ ఏఈవోలు శ్రావణ్, శ్రీనివాస్, పర్యవేక్షకులు పూజిత, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్, పురాణం వంశీ ఉన్నారు.

‘అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి’



ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

సిరిసిల్లటౌన్: ఐసీడీఎస్ పరిధిలో 49 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈమేరకు శుక్రవారం సిరిసిల్లకు వచ్చిన ఆయనను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. గతంలో నిరవధిక సమ్మె చేసిన తమకు అప్పటి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.18వేలు, హెల్పర్లకు రూ.12వేలు వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రిటైర్‌మెంట్ అయిన కార్యకర్తలకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు కార్యకర్తలకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50వేలు మాత్రమే ఇస్తూ జీవో ఇచ్చారన్నారు. ఇన్నాళ్లుగా డిపార్టుమెంటును నమ్ముకుని ఉంటున్న తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆది శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతిపత్రాలు అందించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, రజని తదితరులు పాల్గొన్నారు.


టీబీ రహిత మండలంగా మార్చడమే లక్ష్యం



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ మండలాన్ని టీబీ రహిత మండలంగా మార్చడమే లక్ష్యమని జిల్లా అధికారి దండు బోయిన శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా టీబీ నివారణపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో 26 శాతం కేసులు ఇండియాలో నమోదవుతున్నాయని, దీని ద్వారా ఏటా 3.50 లక్షల మంది చనిపోతున్నారని వివరించారు. టీబీ మహమ్మారిని ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాలను ఎంపిక చేసిందని పేర్కొన్నారు. అందులో సిరిసిల్ల జిల్లా కూడా ఒకటని తెలిపారు. టీబీని జయించిన వారిని టీబీ చాంపియన్‌గా గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి ఇతరులకు అవగాహన కల్పించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిస్ట్రిక్ట్ టీబీ ఆఫీసర్ డాక్టర్ దివ్యశ్రీ, సూపర్‌వైజర్ గంగమరాజు, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్‌ఎం విజ యలక్ష్మి, సరస్వతి, ఆశ వర్కర్లు గౌతమి, ప్రవళిక, మార్త, మాధురి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో 24 టీఎంసీలు



బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులో నీటిమట్టం 24.99 టీఎంసీలకు చేరింది. శుక్రవారం అనంతగిరి ప్యాకేజీ–10కి 6,400 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరదకాల్వ మీదుగా 13,120 క్యూసెక్కుల నీరు వస్తోంది.

వందేభారత్ వస్తోంది..



- 130 కిలోమీటర్ల వేగంతో నాగ్‌పూర్ సికింద్రాబాద్ మధ్య సర్వీసు
- సోమవారం నుంచి ఉమ్మడి జిల్లా వాసులకు అందుబాటులోకి..
- రామగుండంలోనే హాల్టింగ్.. రోజుకు రెండుసార్లు సేవలు
- పెద్దపల్లి, జమ్మికుంటకు హాల్టింగ్ ఇవ్వాలని డిమాండ్
- గతేడాది విజయవంతంగా ట్రయల్ రన్

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందేభారత్ రైలు ఉమ్మడి జిల్లాకు వస్తోంది. ఈనెల 16 సోమవారం నుంచి నాగ్‌పూర్– సికింద్రాబాద్ మధ్య నడిచే ఈ రైలు సేవలు ప్రతిరోజూ (మంగళవారం మినహా) అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం మనరాష్ట్రంలో వందేభారత్ సేవలు రెండురూట్లలోనే ఉన్నాయి. మొదటిది విశాఖపట్నం– సికింద్రాబాద్ కాగా, రెండోది కాచిగూడ– తిరుపతి సర్వీసులు. ఇవి రెండు దక్షిణ మధ్యరైల్వేకు కేటాయించారు. తాజా సర్వీసు సెంట్రల్ రైల్వే కేటాయించిన నాగ్‌పూర్ డివిజన్‌కు చెందినది. సోమవారం ఉదయం ప్రధాని ఈ రైలుకు పచ్చజెండా ఊపగానే.. నాగ్‌పూర్ నుంచి బయల్దేరుతుంది. ఇనాగ్యురల్ రైలు కావడంతో రామగుండానికి రాత్రి 8.30గంటలకు చేరుకుంటుంది. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ స్వాగతం పలుకుతారు.

కేవలం 3 గంటల్లో రాజధానికి..

దేశంలోనే అత్యంత వేగంగా నడిచే రైలుగా వందేభారత్ ప్రసిద్ధి చెందింది. ఈ సర్వీసు ఉమ్మడి జిల్లాకు అందుబాటులోకి రావడాన్ని అంతా స్వాగతిస్తున్నారు. ఇకపై రామగుండం నుంచి సికింద్రాబాద్‌ను కేవలం మూడు గంటల్లోనే చేరుకోవచ్చు. తెలంగాణలో ఈ సర్వీసుకు కేవలం రామగుండం, ఖాజీపేటలో మాత్రమే హాల్టింగ్ కల్పించారు. ప్రతీరోజూ ఉదయం 5గంటలకు నాగ్‌పూర్‌లో (ట్రైన్ నంబరు 20101) బయల్దేరుతుంది. రామగుండంలో ఉదయం 9.15 గంటలకు చేరుతుంది. సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 12.15 గంటలకు ఉంటుంది. తిరిగి మధ్యాహ్నం 1గంటలకు సికింద్రాబాద్ నుంచి (ట్రైన్ నెం.20102)బయల్దేరి.. రామగుండానికి మధ్యాహ్నం 3.15 గంటలకు చేరుకుంటుంది. 20కోచ్‌లు ఉండే ఈ రైలు సోమవారం నుంచి ఉమ్మడి జిల్లా ప్రజలకు సేవలు అందించనుంది.



రూటు	స్పీడు
సికింద్రాబాద్– బల్లార్షా మార్గంలో	130 కి.మీ,
ఖాజీపేట–కొండపల్లి	130 కి.మీ,
సికింద్రాబాద్–ఖాజీపేట	130 కి.మీ,
మానిక్‌నగర్– విరూర్ (3వలైన్)	110 కి.మీ,
మందమర్రి– మంచిర్యాల (3వలైన్)	110 కి.మీ
మంచిర్యాల– పెద్దంపేట (3వలైన్)	100 కి.మీ
పెద్దంపేట– రాఘవపురం (3వ లైన్)	110. కి.మీ
రాఘవపురం– కొలనూరు–పొత్కపల్లి (3వలైన్)	90 కి.మీ.
బిజిగిరి షరీఫ్– ఉప్పల్ (3వలైన్)	100 కి.మీ
పెద్దపల్లి– కరీంనగర్	100. కి.మీ
కరీంనగర్– జగిత్యాల(లింగంపేట)	90 కి.మీ.
జగిత్యాల(లింగంపేట)– నిజామాబాద్	100 కి.మీ
మేడ్చల్– మనోహరాబాద్ సెక్షన్	110 కి.మీ,
మల్కాజిగిరి– మౌలాలి కార్డ్‌లైన్	30.కి.మీ

పెద్దపల్లి, జమ్మికుంటలో హాల్టింగ్ ఇవ్వాలి

వందేభారత్ సేవలకు ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉంది. దీని టికెట్ ఖర్చు అధికంగా ఉన్నా.. వేగంగా వెళ్లాలనుకున్న వారంతా దీన్నే ఎంచుకుంటున్నారు. అయితే ఉమ్మడి కరీంనగర్‌కు సంబంధించి కేవలం రామగుండంలో మాత్రమే నిలుపుతున్నారు. రామగుండం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలవాసులకు అంత సౌకర్యం కాదు. పెద్దపల్లి, జమ్మికుంట స్టేషన్లకు రోడ్ కనెక్టివిటీ బాగున్న నేపథ్యంలో ఈ స్టేషన్లలోనూ హాల్టింగ్ ఇవ్వాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఖాజీపేట -బల్లార్షా మధ్య 130 కి.మీతో..

ఈ రైలు మూడు డివిజన్లలోని పలు సెక్షన్లలో సామర్థ్యాన్ని బట్టి వేగం మారుతోంది. ఖాజీపేట– బల్లార్షా సెక్షన్‌లో 130 కి.మీ గరిష్ట వేగంతో వెళ్తుంది. పెద్దపల్లి–కరీంనగర్ 100. కి.మీ, కరీంనగర్–జగిత్యాల(లింగంపేట) 90 కి.మీ. వేగంతో వెళ్లేలా ట్రాక్‌లు ఇటీవల అప్‌గ్రేడ్ చేశారు. అతి తక్కువగా మల్కాజిగిరి– మౌలాలి సెక్షన్లలో కేవలం 30.కి.మీ స్పీడుకే పరిమితం కావడం గమనార్హం. వేగంపై లైన్ అప్‌గ్రేడేషన్‌తోపాటు లెవెల్ క్రాసింగ్స్, రైల్ ట్రాఫిక్ కూడా ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం బల్లార్షా– ఖాజీపేట సెక్షన్‌లో 110 కి.మీల వేగంతో వెళ్తుందని అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం నిర్వహించుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. సిరిసిల్లలోని మానేరువాగు తీర ప్రాంతాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 17న సిరిసిల్లలో నిమజ్జనోత్సవాలు వైభవంగా నిర్వహించాలన్నారు. అధికారుల సూచనలు పాటిస్తూ మండపాల నిర్వాహకులు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు శాంతియుత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని కోరారు. పోలీస్‌శాఖ నిబంధనల మేరకు సౌండ్‌బాక్స్‌లు పెట్టుకోవాలని సూచించారు. మున్సిపల్, ‘సెస్’, మత్స్య, పోలీస్ శాఖల అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. కావాల్సిన క్రేన్స్, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో 62 మంది సిబ్బందిని, 10 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్‌లోనూ అధికారులను నియమించారు. జిల్లాలో మొత్తం 2,200 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో 400, వేములవాడలో 300, మండలాలు, గ్రామాల్లో కలిపి దాదాపు 2,200 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిర్ణీత సమయానికి విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని ఎస్పీ కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఆర్డీవో ఎల్.రమేశ్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ ఎండీ షరీఫ్ మొహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న విప్ శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్

నిబంధనలు పాటించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం:నిమజ్జన వేడుకల్లో నిబంధనలు పాటించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని వివిధ మండపాలను శుక్రవారం రాత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. మండపాల నిర్వహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా శాంతియుత వాతావరణంలో శోభాయాత్ర సాగేలా సహకరించాలని కోరారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణ ఉన్నారు.

52 ఏళ్లుగా ఆధ్యాత్మిక బాటలో..



మార్కండేయ యూత్ అసోసియేషన్ మంటపంలో పూజలు

సిరిసిల్లటౌన్: వినాయక ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో నాడు యువకులైన నేటి పెద్దలు ప్రస్తుత యువతకు స్ఫూర్తిగా నిలిచారు. మార్కండేయ ఆలయం వీధుల్లోని యువకులు 1972లో శివసుతుడి ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించుకుని మార్కండేయ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అప్పుడు సంఘాన్ని ఏర్పాటు చేసిన వారిలో దివంగత కౌన్సిలర్ కోడం దేవేందర్, ఏరియా పెద్దలైన కుంగుల్‌వార్ దిలీప్‌కుమార్, గుజ్జె రమేశ్ తదితరులున్నారు. వారి ఆధ్వర్యంలో 52 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సంఘం ఏర్పాటు వజ్రోత్సవాలు సందర్భంగా గాంధీచౌక్ నుంచి మార్కండేయ ఆలయానికి వెళ్లే ప్రధాన దారిలో ఆహ్వానతోరణం(కమాన్) నిర్మించారు. 84 మంది శాశ్వత సభ్యత్వాలతో బయట వారిని చందాలు వసూలు చేయకుండానే వేడుకలు నిర్వహిస్తున్నారు. వినాయకుడి ఉత్సవాల మాదిరిగానే విజయదశమికి దుర్గా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను ప్రదర్శిస్తున్నారు.



గురి కుదిరింది

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని మినీస్టేడియాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులతో మాట్లాడి వారికి కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్చరీ క్రీడాకారులతో కలిసి బాణం ఎక్కుపెట్టారు. స్టేడియంలో జిమ్ ఏర్పాటు చేయాలని, కిచెన్‌షెడ్, అదనపు గదుల నిర్మాణాన్ని ప్రభుత్వ పరంగా చేపట్టేలా కృషి చేయాలని మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీకుమార్, కార్యదర్శులు రాందాస్, శ్రీనివాస్, శ్యామ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



- సొంతూరు అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు
- తమ ప్రాంతంపై అభిమానం చాటుకుంటున్న ప్రవాసీలు
- ఆపదలో అండగా.. ఇతరులకు ఆదర్శంగా..
- జన్మభూమి సేవలో తరిస్తున్న మనోళ్లు

పుట్టిన గడ్డపై మమకారం.. ప్రగతికి సహకారం

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని... ఎదురు చూడకుండా మనకోసం.. మన భావితరాల కోసం చేయిచేయి కలిపి చేయలేమా అని ఆలోచిస్తే.. కచ్చితంగా కార్యరూపం దాల్చుతుందని కొందరు నిరూపించారు. ప్రతీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఆధారపడకుండా ప్రజలు తమవంతు సహకారం అందిస్తే ఆ అభివృద్ధి ఫలాలు అందరూ పొందవచ్చని నిరూపిస్తున్నారు. జన్మభూమిపై మమకారం.. ఏదో చేయాలన్న తపన వెరసి పుట్టిన ఊరి సేవలో తరిస్తున్నారు కొందరు ఎన్నారైలు. తోచిన సహాయం.. అభివృద్ధికి సహకరిస్తున్నారు. వెరసి గ్రామాభివృద్ధికి తమవంతు చేయూతనిస్తున్నారు. మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. అలాంటి ప్రవాస భారతీయులపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం..

బాలల భవిష్యత్‌కు బాసట



బాలల గ్రంథాలయం ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ అశోక్ కాచే

మంథని: మంథనికి చెందిన డాక్టర్ అశోక్ కాచే అమెరికాలోని ఓక్లాహోమ రాష్ట్రం తుల్సా పట్టణంలో డాక్టర్‌గా స్థిరపడ్డారు. బ్రెడ్ అనే సంస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. మంథని నియోజకవర్గంతోపాటు జిల్లాలోని పాఠశాలల్లో 730 బాలల గ్రంథాలయాలకు రూ.25వేల నుంచి రూ.30వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. మంథనిలోని సరస్వతి శిశుమందిర్ భవన నిర్మాణానికి రూ.6 లక్షలు అందించారు.

దుబాయ్‌లో రుద్రంగి సంఘం



రుద్రంగిలో దుబాయ్ రుద్రంగి సంఘం వారు నిర్మించిన పోచమ్మ ఆలయం



శ్రీనివాస్, అధ్యక్షుడు, దుబాయ్

రుద్రంగి(వేలమువాడ): రుద్రంగి నుంచి దుబాయ్ వెళ్లిన వారు ఊరిపై మమకారంతో ‘దుబాయ్ రుద్రంగి సంఘం’గా ఏర్పడ్డారు. వారి జీతం డబ్బుల నుంచి కొంతమొత్తం జమచేసి సొంతూరిలో అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్నారు. ఇలా సుమారు రూ.50లక్షల వరకు అందించారు. ఊరిలో సీసీ కెమెరాలు, బస్టాండ్ ఆవరణలో పోచమ్మ ఆలయ నిర్మాణం, ఈరన్నపేట పోచమ్మ ఆలయానికి రేకులషెడ్డు వంటి పనులు పూర్తి చేశారు.

ప్రగతికి సహకారం



డాక్టర్ కుసుమ విఠల్



తోట రామ్‌కుమార్

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లకు చెందిన డాక్టర్ కుసుమ విఠల్ హైదరాబాద్ గాంధీ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్, ఎండీ, అమెరికాలో గ్యాస్ట్రో ఎంటరాలజీలో సూపర్ స్పెషలైజేషన్ కోర్సు చేశారు. పండుగకు సొంతూరుకొచ్చిన విఠల్ చదువుకున్న బడిని బాగుచేసేందుకు రూ.15లక్షలు విరాళంగా అందించారు. అమెరికాలో ప్లాస్టిక్ సర్జన్‌గా పనిచేస్తున్న కొడుకు శశిధర్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో మెగా వైద్యశిబిరం నిర్వహించి వందకు పైగా ఆపరేషన్లు చేశారు. గాంధీ మెడికల్ కాలేజీకి రూ.15 లక్షలు అందించారు.

వేములవాడ కోసం టీఆర్‌కే

ముప్పై ఏళ్ల క్రితం పదో తరగతి సర్టిఫికెట్‌తో దుబాయ్ వెళ్లిన తోట రామ్‌కుమార్.. కాలక్రమంలో రాజన్న పేరుతో ఎస్‌ఆర్‌ఆర్ బీఎంటీని ప్రారంభించి విజయవంతమయ్యారు. టీఆర్‌కే ఫౌండేషన్ పేరుతో వేములవాడ ప్రాంతాభివృద్ధి కృషి చేస్తున్నారు. ఆలయాలు, బడులు, పేదలకు నిత్యావసరాల కోసం పెద్ద మొత్తంలో విరాళాలు అందిస్తున్నారు.

సొంతూరిపై మమకారం



బాడీ ఫ్రీజర్‌ను అందజేస్తున్న రాములు



మోతె రాములు

చందుర్తి(వేములవాడ): చందుర్తికి చెందిన మోతె రాములు 20 ఏళ్ల క్రితం దుబాయ్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడడంతో గ్రామాభివృద్ధిలో ముందుంటున్నారు. ప్రతిమ ఫౌండేషన్‌కు కంట్రిబ్యూషన్‌ను చెల్లించి అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే గల్ఫ్‌లో ఉంటున్న వారి బంధువులు వచ్చే వరకు భద్రపరిచేలా గ్రామానికి ఫ్రీజర్‌ను అందించారు. ఇటీవల రూ.3.60లక్షలతో వైకుంఠరథం అందజేశారు.

వలస జీవి.. స్నేహశీలి



రాజేశం భార్య భారతికి రూ. 50 వేల చెక్కు అందిస్తున్న నర్సింగం మిత్రమండలి (ఫైల్)



నర్సింగం

బోయినపల్లి(చొప్పదండి): జీవనోపాధి కోసం ఇరవై ఏళ్ల క్రితం దుబాయి వెళ్లిన బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన వరాల నర్సింగంపటేల్ ఆపదలో ఉన్న స్నేహితుల కుటుంబాలను ఆదుకుంటున్నారు. దుబాయ్‌లో ఉంటూనే మిత్రుల ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వివిధ కారణాలతో మృతిచెందిన గ్రామస్తులు, స్నేహితుల కుటుంబాలు రోడ్డున పడకుండా ఆర్థికంగా ఆదుకుంటున్నారు. స్థానిక మల్లికార్జున ఆలయానికి రూ.3.90 లక్షలు అందించారు. సుమారు 50 మందికి దుబాయ్‌లో ఉపాధి కల్పించారు.

గల్ఫ్‌లో ఉన్నా పుట్టిన ఊరిపై అభిమానం



గంభీర్‌పూర్‌లో వలసజీవుల సహకారంతో నిర్మించిన బస్టాండ్

కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన పలువురు యువకులు దుబాయి, సౌదీఅరేబియా, బహ్రెయిన్, మస్కట్ వెళ్లారు. ఉపాధి కోసం ఊరిని వదిలినప్పటికీ గ్రామాభివృద్ధిలో ముందుంటున్నారు. ఆరేళ్ల క్రితం రూ.3లక్షలతో బస్టాండ్, రూ.8 లక్షలతో హనుమాన్ ఆలయం నిర్మించారు.

సామాజిక సేవలో తండ్రీకొడుకులు



లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఆవిష్కరణలో శశాంక్, ఎన్‌ఆర్‌ఐ వడ్డెపల్లి శ్రీనివాస్

మల్యాల(చొప్పదండి): మండల కేంద్రానికి చెందిన వడ్డేపల్లి శ్రీనివాస్ 1995లో ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఉద్యోగం చేస్తూనే తన కుమారుడు శశాంక్ ద్వారా గ్రామంలోని సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారు. మల్యాలలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష అందించారు. స్వాతంత్య్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మల్యాల జీపీకి ట్రాక్టర్ అందజేశారు. ముత్యంపేటలో మసీదు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

శ్రీమంతుడు.. విద్యాధర్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): సాతారం గ్రామానికి చెందిన గంద్ర విద్యాధర్ విదేశాల్లో స్థిరపడి సొంతూరి ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.4 లక్షలతో శుద్ధ జలప్లాంట్ నిర్మించారు. రూ.10 సీసీరోడ్లను నిర్మించారు. గ్రామంలోని పలు కాలనీల్లో రూ.5లక్షలతో మినీవాటర్‌ట్యాంక్‌లు నిర్మించారు. తన సొంతిల్లును పాఠశాలకు విరాళంగా అందించారు.





సాతారంలో ఎన్‌ఆర్‌ఐ గంద్ర విద్యాధర్‌రావు నిర్మించిన వాటర్ ప్లాంట్

క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థులకు సప్లిమెంటరీ అవకాశం

సిరిసిల్లకల్చరల్: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీలో చేరి సకాలంలో పూర్తి చేయలేకపోయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు వర్సిటీ నిర్ణయించింది. ఈమేరకు పరీక్షల నియంత్రణాధికారి శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సెమిస్టర్ విధానానికి ముందు బీఏ, బీకామ్, బీబీఏ, బీఎస్సీ వంటి డిగ్రీ కోర్సుల్లో చేరి ఉత్తీర్ణులు కాని విద్యార్థులు తమ బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు త్వరలో పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. అక్టోబర్ 8వ తేదీలోపు తాము చదువుకున్న డిగ్రీ కాలేజీలో సంప్రదించి ఫీజులు చెల్లించాలని సూచించారు. యూనివర్సిటీ కల్పిస్తున్న చివరి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆయుష్మాన్ బీమా హర్షణీయం

సిరిసిల్లకల్చరల్: ఆయుష్మాన్ బీమా పథకం ద్వారా 70 ఏళ్లు దాటిన వృద్ధులకు రూ.5లక్షల బీమా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని జిల్లాలోని సీనియర్ సిటిజన్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య మాట్లాడుతూ షరతులు, ఆర్థిక పరిమితులు లేకుండా రూ.5లక్షల బీమా పథకాన్ని అమలు చేస్తామన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ప్రతినిధులు అంకారపు జ్ఞానోభ, పుల్లూరి మల్లేశం, ఏనుగుల ఎల్లయ్య, శ్రీగాద మైసయ్య, ఇరుకుల్ల భాస్కర్ ఉన్నారు.

16న క్యాన్సర్ కణాల గుర్తింపు శిబిరం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో సోమవారం క్యాన్సర్ కణాల గుర్తింపు ఉచిత వైద్యశిబిరం హైదరాబాద్ ఏంఎన్‌జే ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బీవైనగర్‌లోని షాదిఖానాలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

రక్తదానం చేసిన యువకులు



రక్తదానం చేస్తున్న శివరామకృష్ణ, అనిల్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన నిమ్మ నారాయణరెడ్డి అనారోగ్యంతో మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. రక్తం అత్యవసరం పడడంతో మండల కేంద్రానికి చెందిన యువకులు ఇద్దరు ఇచ్చారు. ఆర్టిస్ట్ శ్యామంతుల అనిల్, బీఆర్ఎస్ యూత్ లీడర్ చందనం శివరామకృష్ణ రక్తదానం చేశారు. చందనం శివరామకృష్ణ 19వ సారి రక్తదానం చేశారు.

ఓటరుజాబితా ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని 26 గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు ఎంపీడీవో శుక్రవారం తెలిపారు. ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 14 నుంచి 21లోపు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈనెల 28న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర పోటీలకు విద్యార్థులు



సిరిసిల్లటౌన్: రాష్ట్రస్థాయి పోటీలకు సిరిసిల్ల ఇంగ్లిష్ యూనియన్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలు ఈనెల 14 నుంచి హన్మకొండలో జరుగనుండగా.. జిందం వర్షిత్, రేనన్య, ఎం.మనోజ్, జి.రుత్విక్ ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు.

గాయం'మానాల'.. వైద్యం అందేలా..



ఈ మహిళ పేరు మాలోతు గమ్మి. మానాల శివారులోని సర్పంచ్ గిరిజనతండాకు చెందిన గమ్మికి ఏడాదిగా కళ్లు మసకబారాయి. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుందామంటే ఆర్థిక స్థోమత లేదు. మెగా వైద్యశిబిరంలో కంటి పరీక్షలు చేసి కళ్లజోడు అందించారు.



ఈమె భూక్యా లింబీ. మానాల శివారులోని రూప్లానాయక్‌తండాకు చెందిన లింబీ రెండేళ్లుగా మెడనొప్పితో బాధపడుతోంది. వ్యవసాయ పనులు చేసే లింబీకి మెగా వైద్యశిబిరంలో డాక్టర్లు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.



చేతిలో కర్ర.. మాసిన గడ్డంతో ఉన్న ఇతను మాడవేణి గంగారాం. మానాలకు చెందిన గంగారాం కాలుకు సెప్టిక్ కావడంతో ఇబ్బంది పడుతున్నాడు. వైద్యశిబిరంలో పరీక్షలు చేసిన వైద్యులు.. ఎల్లారెడ్డిపేట అశ్విని ఆస్పత్రికి వస్తే ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. నొప్పి తగ్గడానికి ప్రస్తుతం మందులు అందించారు. ఇలా ఒక్కరు.. ఇద్దరు కాదు.. ఏకంగా 800 మంది మానాల, ఆ శివారులోని ఏడు గిరిజన తండాల ప్రజలకు పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో ఉచితంగా వైద్యసేవలు అందించారు.

- గిరిజనానికి మెగా వైద్యశిబిరం
- అటవీపల్లెల్లో పోలీసుల చొరవ
- ప్రజా ఆరోగ్యంతోనే పల్లెలు బాగుంటాయి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మెగా వైద్యశిబిరంలో 800 మందికి వైద్యసేవలు

రుద్రంగి(వేములవాడ): మానాల అడవులు.. పోలీసుల బూట్ల చప్పుడు వింటేనే చెట్ల ఆకులు సైతం ఎరుపెక్కేవి. నక్సలైట్ ఉద్యమం ఉధృతంగా ఉన్న రోజుల్లో ఈ ప్రాంతంలో నిత్యం అలజడే. పెత్తందారి వ్యవస్థపై తిరుగుబాటు చేసిన ఈ ప్రాంత ప్రజలపై ఆనాటి పోలీస్ వ్యవస్థ నిర్బంధం కొనసాగించింది. తుపాకుల పోరులో మానాలతోపాటు ఆ ఏడు పల్లెలు కన్నీటి సెలయేరుగా మారాయి. అయితే నేడు అదే పోలీస్ వ్యవస్థ ఈ ప్రాంత ప్రజల కన్నీరును తుడ్చేందుకు ఒక్క అడుగు ముందుకేసింది. ఈ ప్రాంతంలోని గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రుద్రంగి మండలం మానాలలో నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ క్యాంపునకు దాదాపు 800 మంది గిరిజనులు హాజరయ్యారు.

ప్రజా ఆరోగ్యంతోనే పల్లెలు బాగుంటాయి

ప్రజా ఆరోగ్యంతోనే పల్లెలు బాగుంటాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మానాలలో పోలీస్‌శాఖ నిర్వహించిన మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పల్లెప్రజలకు మేమున్నామంటూ పోలీసులు వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. పోలీసులు అంటేనే భయంతో వణికిపోయే రోజులు పోయి.. వాళ్లు.. మావాళ్లే.. మన కోసం పని చేస్తారని ప్రజలు గుర్తించే రోజు వచ్చిందన్నారు. ఈ వైద్యశిబిరంలో పాల్గొన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, ఎల్లారెడ్డిపేట అశ్విని ఆస్పత్రి, కరీంనగర్ రెనె ఆస్పత్రి డాక్టర్లను, సిబ్బందిని అభినందించారు. రుద్రంగిలో ప్రభుత్వ ఆస్పత్రిని త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం, విద్య అనే లక్ష్యంతో ముందుకెళ్తుందని తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, రాష్ట్ర యూనియన్ కోపరేటీవ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో వసంతరావు, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మానాల ఉచిత వైద్యశిబిరానికి హాజరైన గిరిజనులు, స్థానికులు



మానాల వైద్యశిబిరంలో ఉచిత కంటి పరీక్షలు

రక్తహీనతకు మెరుగైన వైద్యం



మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలంటే మద్యపానానికి దూరంగా ఉండాలి. ఈ ప్రాంతంలో ఎక్కువ మందిలో రక్తహీనత సమస్య ఉంది. వారికి పరీక్షలు చేసి మెరుగైన వైద్యసేవలకు అవసరమైతే కరీంనగర్, హైదరాబాద్‌కు పంపించి ఉచిత వైద్య సేవలు అందిస్తాం.

– సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్

కమ్యూనిటీ పోలీసింగ్‌లో వైద్యశిబిరం



కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. గ్రామాల్లో యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి. పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనించాలి. ఎవరైనా గంజాయికి అలవాటు పడితే సిరిసిల్ల డీ–అడిక్షన్ సెంటర్‌కి పంపించాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

ఏచూరి మరణం తీరని లోటు

సిరిసిల్లఅర్బన్: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి, ప్రజలకు తీరని లోటు అని ఐద్వా జిల్లా కార్యదర్శి జువ్వాజి విమల పేర్కొన్నారు. పట్టణంలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి జువ్వాజి విమల మాట్లాడుతూ సీపీఎం జాతీయ కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నో సేవలు అందించాడని కొనియాడారు. సురం పద్మ, మహిళలు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

రక్తాభిమానం



వేములవాడ: అభిమానాన్ని ఒక్కొక్కరు ఒక్కో విధంగా చూపిస్తుంటారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన తోకల అనిల్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాన్ని తన రక్తంతో గీసి శుక్రవారం ఆయనకు బహూకరించాడు.

ఐదు డీఏలు విడుదల చేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం వెంటనే ఐదు డీఏలను విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను ఏకకాలంలో చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలో శుక్రవారం తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీకి ఓటుహక్కు కల్పించాలని, ఆదర్శ పాఠశాల టీచర్లకు బదిలీలతోపాటు పదోన్నతులు కల్పించాలని, కేజీబీవీ టీచర్లు, సిబ్బందికి కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీపీఎస్ బిల్లులు, మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

వాకింగ్‌ట్రాక్ చదును



వేములవాడ: మండల పరిషత్ ఆవరణలోని వాకింగ్‌ట్రాక్‌ను శుక్రవారం మరమ్మతు చేశారు. వాకింగ్‌ట్రాక్‌పై మున్సిపల్ ఆధ్వర్యంలో 60 ట్రిప్పుల మొరం పోయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాకింగ్ ట్రాక్ దెబ్బతిందని వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు రేగుల రాము, గోస్కుల రవి తదితరులు మున్సిపల్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి పాలకవర్గం మొరం పోయించింది.



రాజన్న గణేశుడికి ప్రత్యేక పూజలు

వేములవాడ: రాజన్న ఆలయంలోని నాగిరెడ్డి మంటపంలో ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు శుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి దేవుడికి మహాగణపతి మూలమంత్ర హవనం, రాత్రి 7.15 గంటలకు మహాపూజ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు భాద్రపద శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని హవనానంతరం పూర్ణాహుతి, రాత్రి 7.15 గంటలకు గణేశ్ నిమజ్జనోత్సవం ఉంటుందని ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు.

నేడు సాహిత్య గోష్టులు

సిరిసిల్లకల్చరల్: సుప్రసిద్ధ కథా రచయితల కథల సంకలనం 'కరీంనగర్ కథలు' పుస్తక పరిచయ సభ శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు రంగినేని ట్రస్టు తెలిపింది. ట్రస్టు వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు సభాధ్యక్షుడిగా వ్యవహరించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి కార్యదర్శి ఆచార్య సి.మృణాళిని, విశిష్ట అతిథిగా అల్లం రాజయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి ఆచార్య సి.కాశీం అతిథులుగా హాజరవుతున్నారు. డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం కథా సంకలన ప్రస్తావన చేస్తారు.

సీతారాం పురస్కార ప్రదానం

తెలంగాణ తొలితరం కథా రచయిత గూడూరి సీతారాం స్మారక కథా పురస్కార ప్రదానోత్సవాన్ని శనివారం సాయంత్రం సిరిసిల్లలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు మానేరు రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. బంజారాల జీవితాలను కథలుగా ఆవిష్కరించిన సూర్యా ధనుంజయ్‌తోపాటు సామన్యుల వెతలను కథలుగా మలిచిన పిన్నంశెట్టి కిషన్‌లకు పురస్కారాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్య అతిథులుగా కాళోజీ పురస్కార గ్రహీత, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్, దాశరథి పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథం, పురస్కార ప్రదాత గూడూరి వేణు, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, నేషనల్ బుక్ ట్రస్టు ఉపసంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ హాజరవుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సిరిసిల్లటౌన్: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారిని రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. సిరిసిల్లకు చెందిన న్యాయవాదులు తిరుమల్‌గౌడ్, అంతర్జాతీయ 15వ ఏషియన్ క్రిమినాలజీ సదస్సుకు ఎంపికైన న్యాయవాది చెక్కిల్ల మహేశ్‌గౌడ్‌తోపాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పాకాల శంకర్‌గౌడ్‌ను గోపా సన్మానించింది. గోపా గౌరవ అధ్యక్షుడు గుగ్గిళ్ల జగన్‌గౌడ్, బుర్ర వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్, అంజాగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి పోలీసుల అదుపులో తహసీల్దార్

- తప్పుడు పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన నరేశ్‌ను స్థానిక పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. మండలంలోని అనంతపల్లికి చెందిన సలేంద్ర మల్లేశంకు చెందిన 104, 105 సర్వేనంబర్లలోని భూమిని అదే గ్రామానికి చెందిన సలెంద్ర వేణు, లక్ష్మిలకు తప్పుడు పత్రాలతో పట్టా చేశారన్న ఫిర్యాదుతో అదుపులోకి తీసుకుని విచారించి వదిలేసినట్లు సమాచారం. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ నరేశ్‌ను అదుపులో తీసుకున్నారన్న సమాచారంతో పలు గ్రామాల్లో తప్పుడు డ్యాకుమెంట్లను సృష్టించి పట్టాలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బండపల్లికి చెందిన 511, 591 సర్వేనంబర్లల్లో అక్రమ పట్టాలు చేశారని జిల్లా ఉన్నతాధికారులకు గ్రామ మాజీ ఎంపీటీసీలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై సీఐ వెంకటేశ్వర్లను వివరణ కోరగా తహసీల్దార్ నరేశ్‌పై ఉన్న ఆరోపణల మేరకు అదుపులోకి తీసుకుని విచారించి, వదిలేసినట్లు తెలిపారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

- బీజేపీ సభ్యత్వ జిల్లా ఇన్‌చార్జి చంద్రయ్య

సిరిసిల్లటౌన్: ప్రజాసంక్షేమమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య పేర్కొన్నారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర నాయకుడు ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.



108 నైవేద్యాలు



రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి శుక్రవారం 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

- 24గంటల్లోనే చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు
- 66గ్రాముల బంగారం స్వాధీనం



గంభీరావుపేట(సిరిసిల్ల): దొంగతనం కేసును గంభీరావుపేట పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి 66 గ్రాముల బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎల్లారెడ్డిపేట సీఐ తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన పురం గోవర్ధన్‌రావు ఇంట్లో దొంగతనం జరిగింది. బీరువా నుంచి 66 గ్రాముల బంగారు ఆభరణాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో ఎస్సై రామ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన కర్రోల్ల నర్సింలును అరెస్టు చేసి అతని నుంచి బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రామ్మోహన్‌ను, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

చిల్లరదొంగ అరెస్టు



సిరిసిల్ల క్రైం: జిల్లా కేంద్రంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలతోపాటు ఇంటి నిర్మాణానికి తీసుకొచ్చిన సామాగ్రిని ఎత్తుకెళ్లే చిల్లర దొంగను సిరిసిల్లటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తంగళ్లపల్లి మండలానికి చెందిన రాజు జిల్లా కేంద్రంలోని వెంకంపేటలో గురువారం రాత్రి పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. సీసీ పుటేజీ వీడియోను సిరిసిల్లటౌన్ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో స్థానికులు దొంగతనం చేసింది రాజు అని గుర్తుపట్టారు. దర్యాప్తు చేసిన పోలీసులు రాజును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సామిల్లులపై అటవీ అధికారుల దాడులు


కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కోనరావుపేట, నిజామాబాద్ గ్రామాల్లో సామిల్లులపై అటవీ అధికారులు దాడులు చేశారు. చంద్రగిరి శ్రీనివాస్ వద్ద రూ.4,426 విలువైన కలప, చారి వద్ద రూ.8,471 విలువైన కలపను స్వాధీనం చేసుకుని దుగోడ మిషన్లను సీజ్ చేశారు. నిజామాబాద్‌లో బూర్గుపెల్లి కిషన్, రాజుల వద్ద రూ.27వేల విలువైన కలపతోపాటు యంత్రాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో చందుర్తి ఎఫ్ఆర్‌వో ఖలీలొద్దీన్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో మోహన్‌లాల్, స్ట్రైకింగ్ ఫోర్స్ ఎఫ్ఆర్‌వో కల్పనాదేవి, ఎఫ్ఎస్‌వోలు శ్రీనివాస్, భూలక్ష్మి, బీట్ అధికారి అభిషేక్‌రావు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో 18 మందికి జరిమానా

వేములవాడ: చర్చి ఫాదర్‌పై హత్యాయత్నం కేసులో 18 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ వేములవాడ సబ్ జడ్జి రాధికాజైశ్వాల్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ పట్టణ పరిధిలోని చర్చిలో ఫాదర్‌గా పనిచేస్తున్న బ్రదర్ సువర్ణపాల్‌పై అదే చర్చిలో ఫాదర్ పనిచేసి తొలగించబడిన తిమోతి ద్వేషం పెంచుకున్నాడు. తన తొలగింపునకు సువర్ణపాల్ కారణమని భావించి 2015లో 17 మంది అనుచరులతో కలిసి చర్చిలోకి ప్రవేశించి సువర్ణపాల్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేయగా టౌన్ సీఐ వెంకటేశ్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి రాధికాజైశ్వాల్ నిందితులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

- మరొకరికి గాయాలు



సంఘటన స్థలంలో రాజు మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయ సమీపంలో గంభీరావుపేట–ఎల్లారెడ్డిపేట ప్రధాన రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ధ్యానబోయిన రాజు(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కోరుట్లపేట వైపు వస్తున్న రాజు ద్విచక్రవాహనం, కోరుట్లపేటకు చెందిన ఎరుకల పెద్ద పోచయ్య అనే వ్యక్తి పొలం వద్దకు వెళ్తుండగా ఇరువురి బైక్‌లు ఢీకొన్నాయి. రాజు మృతిచెందగా.. పోచయ్యకు గాయాలయ్యాయి. అతన్ని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాజుకు భార్య సుమలత, కుమారుడు వంశీ ఉన్నారు. సంఘటన స్థలానికి మృతుని బంధువులు, కుటుంబసభ్యులు చేరుకొని రోధించడం పలువురిని కంటతడి పెట్టించింది.